క్లుప్తంగా

ఢిల్లీ శిక్షణలో ఉమాదేవి



భూపాలపల్లి అర్బన్: మలేరియా నియంత్రణపై న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలకు జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ ఉమాదేవి సోమవారం హాజరయ్యారు. ఎన్‌సీడీసీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 30 వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ ఉమాదేవి తెలిపారు. 2027 సంవత్సరం నాటికి మలేరియా నివారణ లక్ష్యంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ తరపున భూపాలపల్లితో పాటు ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాలకు చెందిన అధికారులు మాత్రమే పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కాటారం: కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్యను సోమవారం మండల కిరాణా వర్తక సంఘం, మండల ఫెర్టిలైజర్, ఫెస్టిసైడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మార్కెట్‌ను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడంతో పాటు రైతులకు విస్తృతంగా సేవలు అందించాలన్నారు. మార్కెట్ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు ఉపయోగపడే విధంగా మండల కేంద్రంలో కోల్డ్ స్టోరేజ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కలికోట శ్రీనివాస్, రత్న రవి, గంగిరెడ్డి లచ్చిరెడ్డి, బీరెల్లి రమేశ్, రాజు, వంశీ, చీర్ల రమేశ్, దారం నగేశ్‌కుమార్, బాసాని రవి, నందకిశోర్, రవి, చిట్టూరి శ్రీనివాస్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు..



సన్మానిస్తున్న నాయకులు

కాళేశ్వరం: కాటారం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకమైన మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ఇర్షాద్‌ను సోమవారం మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాబు, నిట్టూరి నగేష్, సుందర్ సన్మానించారు. ఆయన నియామకంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

ప్రైవేట్‌కు దీటుగా విద్యా బోధన



మాట్లాడుతున్న సుధాకర్

టేకుమట్ల: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన చేయాలని మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నమోదుకు సంబంధించి ప్రధానోపాధ్యాయుల నుంచి పలు వివరాలను సేకరించారు. ప్రతీ ఉపాధ్యాయుడు అంకిత భావంతో పని చేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఎంఈఓ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పద్మ, రమేష్, రామచంద్రు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



రవి(ఫైల్)

చిట్యాల: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తిర్మలాపూర్ గ్రామానికి చెందిన పెండ్లి రవి (42) ఆదివారం రాత్రి గ్రామంలోని ఎవరినో తిడుతుండగా అతడి భార్య కోమల గొడవ ఎందుకని చెప్పి ఇంట్లో పడుకోబెట్టింది. అనంతరం ఆమె కూతురు, కుమారుడితో సహా ఇంటి ముందు ఉన్న షెడ్డులో నిద్రించారు. ఈ క్రమంలో అర్ధరాత్రి కుమారుడు లైట్ అడుగగా ఆమె లైట్ కోసం ఇంట్లోకి వెళ్లి చూడగా రవి ఇంట్లో వాసానికి చున్నీతో ఉరేసుకుని కనిపించాడు. ఇంటి పక్కవారిని పిలవడంతో వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తల్లి లింగమ్మ తన కుమారుడి మృతికి గల కారణాలు తెలుసుకొని కారకులపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు.

మెట్ట పంటలకు అనుకూలం

- తేలికపాటి వానలతో ఆశాజనకంగా పత్తి, మొక్కజొన్న సాగు
- చెరువులు నిండకపోవడంతో వరినాట్లు ఆలస్యం



పెరుగుతున్న పత్తి మొక్కలు

రేగొండ: ప్రస్తుతం కురిసిన తేలికపాటి వానలు మెట్ట పంటల సాగుకు అనుకూలంగా మారాయి. మండలంలో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంటలకు అడపాదడపా కురుస్తున్న వానలు కలిసివస్తున్నాయి. వానాకాలం ఆరంభమై రెండు నెలలు కావస్తున్నా భారీ వర్షాలు కురవలేదు. దీంతో వరినాట్లు ఆలస్యమవుతున్నాయి. నాలుగు రోజులుగా మండల వ్యాప్తంగా ఓ మోస్తారు వర్షాలు కురుస్తుండడంతో వరినాట్లు కూడా ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. భారీ వర్షాలు కురిస్తే వరినాట్లు ఊపందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సాధారణ వర్షపాతం..

ఈ ఏడాది జూన్‌లో మండలంలో సాధారణ వర్షపాతం నమోదైంది. రైతులు జూన్ ఆరంభం నుంచే మెట్ట పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. సుమారు 15 వేల ఎకరాల్లో ఈ ఏడాది పత్తి సాగు చేస్తున్నారు. జూన్‌లో ప్రతికూల పరిస్థితుల్లో పత్తి మొలక శాతం కొన్ని ప్రాంతాల్లో తక్కువగా ఉంది. దీంతో రైతులు రెండోసారి పత్తి గింజలు వేసుకున్నారు. జూలైలో అడపాదడపా కురుస్తున్న వానలు పత్తి పంటకు జీవం పోశాయి. ప్రస్తుతం కురుస్తున్న వానలు పత్తికి మరింత అనుకూలంగా మారాయి. పత్తిచేలు అడుగు ఎత్తు పెరిగి ఆశాజనకంగా ఉన్నాయి. జూన్ మొదటి వారంలో ముందుగా వేసిన పత్తి చేలు పూత దశకు చేరాయి. పత్తికి ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.589 మద్దతు ధర పెంచింది. దీంతో క్వింటా పత్తి ధర రూ.8100కు చేరింది. పత్తి చేలల్లో కలుపు తీసి రైతులు తొలివిడత ఎరువులు వేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.



పూత దశలో ఉన్న మొక్కజొన్న పంట

నిండని చెరువులు..

ఇప్పటి వరకు మండలంలో భారీ వర్షాలు కురువకపోవడంతో చెరువులు, కుంటలు నిండలేదు. సరైన వానలు లేక ఒకనొక దశలో వరినార్లు కూడా ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. కాగా, గత నాలుగు రోజులుగా కురుస్తున్న వానలకు వరినాట్లు మొదలయ్యాయి. మడ్తపల్లి, దమ్మన్నపేట, చిన్నకోడేపాక, కొత్తపల్లిగోరి గ్రామాలలోని పెద్ద చెరువులకు నీరు రాలేదు. దీంతో వరినాట్లు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. భారీ వర్షాలు కురిసి చెరువులు నిండితే వరినాట్లు పూర్తవుతాయి. వర్షాలు సరిగా కురవకపోతే మండలంలో ఈ సంవత్సరం వరిసాగు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పత్తికి అనుకూలంగా ఉంది



ఈ ఏడాది కురుస్తున్న తేలికపాటి వానలు పత్తి పంటకు అనుకూలంగా ఉన్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పత్తి ఏపుగా పెరుగుతోంది. తొలివిడత ఎరువులు వేయడం పూర్తయింది. మరో వారం రోజుల్లో రెండో విడత ఎరువులు వేస్తే పూతకు వస్తుంది.

– మానూరి అశోక్, రైతు, కొత్తపల్లిగోరి

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా..



చల్లగరిగలో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల/టేకుమట్ల: నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామంలో జెన్‌కో సీఎస్ఆర్ నిధులు రూ.10లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు సోమవారం శంకుస్థాపన చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కాల్వపల్లి, గిద్దెముత్తారం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే టేకుమట్ల మండలంలోని హైస్కూల్‌లో రూ.10లక్షలతో మౌలిక సదుపాయాల పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. కలికోటపల్లి గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గర్మిళ్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిరుపేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని అన్నారు. రెండేళ్లలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తూ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు పిచ్చి మాటాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం పంపులు ఆన్ చేయకపోతే నిరాహార దీక్షలు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలోనే విచ్చలవిడిగా ఇసుక దందాలు చేసి ఇప్పుడు మళ్లీ వారే ధర్నాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. మా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక అందిస్తుంటే చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాటారం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎపిడమిక్ టీం సభ్యులు రమేశ్‌కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ పరమేశ్వర్ అన్నారు. ఇన్‌చార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీదేవి ఆదేశాల మేరకు మండలంలోని బొప్పారం, జాదారావుపేట గ్రామాలను సోమవారం వారు సందర్శించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల ప్రభావం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ఆరా తీశారు. ఇంటింటా తిరిగి జ్వర బాధితుల వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలను నిర్వహించి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి వైద్య సిబ్బంది ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు కాపర్తి రాజు, సుజాత, శ్యామల, పంచాయితీ కార్యదర్శి శివ, ఆశా కార్యకర్తలు రాజేశ్వరీ, స్వరూప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామంలో వివరాలు తెలుసుకుంటున్న సభ్యులు

పుస్తక పఠనంపై శ్రద్ధ వహించాలి

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజబాబు

కాళేశ్వరం: విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ కోట రాజబాబు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయనను సోమవారం మహదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విజ్ఞానం, విద్య, సంస్కృతిక అభివృద్ధికి ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఎం చీర్ల శ్రీనివాస రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్, పాఠశాల డైరెక్టర్ ఆకుతోట రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజబాబును సన్మానిస్తున్న యాజమాన్యం

డిజిటల్ తరగతులు ప్రారంభం

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని కాటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులను హెచ్ఎం బాణాల సుధాకర్ సోమవారం ప్రారంభించారు. ఎన్ఆర్ఐ పులి రవి అందించిన ట్యాబ్‌లలో విద్యార్థులకు డిజిటల్ తరగతులను బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ ల్యాబ్ గదిలో ట్యాబ్‌ల సాఫ్ట్‌వేర్ ఆధారంగా డిజిటల్ క్లాస్ నిర్వహించామన్నారు. తరగతులకు సంబంధించి పరిజ్ఞానాన్ని విద్యార్థులు నేర్చుకుంటూ అందులో సైన్స్ క్విజ్ సబ్జెక్టు వారీగా నిర్వహించుకుంటూ విద్యార్థులు అభ్యసించినట్లు తెలిపారు. డిజిటల్ క్లాసుల్లో చదువుతో పాటుగా అందులో ఉన్న వీడియో చూస్తూ క్లాసులు స్వయంగా వినడంతో చాలా అనుభూతి కలిగిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ట్యాబ్‌లు వితరణ చేసిన ఎన్నారై పులి రవి, హెచ్ఎం సుధాకర్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు సక్రు నాయక్, అక్బర్ బాషా, జీవన్ లాల్, సమ్మయ్య, సామ్సన్, పాపారావు, విజయ, శ్రీదేవి, రాజేష్, జయపాల్, వెంకటేష్, మోహన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ చార్జీల పేరుతో బాదుడు



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: ఆర్టీసీ అధికారులు చార్జీలు పెంచి ప్రయాణికుల నుంచి విచ్చలవిడిగా బాదుతున్నారని బీజేపీ అర్బన్ అధ్యక్షుడు గీస సంపత్‌కుమార్ ఆరోపించారు. పెంచిన బస్ చార్జీలను సవరించాలని కోరుతూ భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందూకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ.. కాటారం నుంచి భూపాలపల్లి వరకు 23 కిలోమీటర్ల దూరానికి రూ.70 చార్జీ తీసుకున్నట్లు తెలిపారు. గతంలో రూ.40 మాత్రమే టికెట్ ధర ఉందన్నారు. అదనంగా రూ.30 పెంచి ప్రయాణికులను ఆర్థికంగా ఇబ్బందులు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన చార్జీలను తగ్గించాలని లేనిపక్షంలో దశల వారీగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు రాజేందర్, శ్యామ్, సుధాకర్, రాజయ్య పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ శాఖ మండల అధికారి కల్యాణి ఎస్సై సుధాకర్‌తో కలిసి సోమవారం తనిఖీలను చేశారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్‌లు, బిల్లు బుక్కులు, ధరల పట్టికను పరిశీలించారు. అలాగే షాపుల్లో నిల్వ చేసిన ఎరువుల వివరాలను తెలుసుకున్నారు. వారి వెంట ఏఈఓలు ఉన్నారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

రేగొండ: కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం అండాల్ అమ్మ వారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కుంకుమార్చనలు, ఒడి బియ్యం కార్యక్రమాలు చేశారు. అనంతరం ఆరగింపు, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ సంస్థల అధినేత సంపత్‌రావు, అర్చకులు బుచ్చమచార్యులు, శ్రీనాధచార్యులు, ఆలయ సిబ్బంది శ్రావణ్, సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

వాజేడు : స్థానిక విద్యావనరుల కేంద్రంలో సోమవారం ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు లైబ్రరీ పుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలోని 38 పాఠశాలలకు వీటిని అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. లైబ్రరీ పుస్తకాలను ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

- అదనపు కలెక్టర్ విజయలక్ష్మి



స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

రేగొండ: మండలంలో ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి హెచ్చరించారు. సోమవారం మండలంలోని పీఏసీఎస్ గోదాంలోని ఎరువులు, స్టాక్ బోర్డుల ఏర్పాటు, ధరల పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో ఎరువుల కొరత లేదని, అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎరువుల బస్తాల కోసం రైతుల ఆధార్ నమోదు చేయాలని, రద్దీ ఉంటే స్లిప్పులు జారీ చేసి రైతులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చూసుకోవాలని నిర్వాహకులకు తెలిపారు. అలాగే మండలంలోని పీహెచ్‌సీని సందర్శించి ఫార్మసీలోని మందులను, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రజారోగ్య పరిరక్షణలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వర్షకాలం దృష్ట్యా అంటువ్యాధుల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డి, మండల వైద్యాధికారిణి హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

- అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్



రిజిస్టర్ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అశోక్‌కుమార్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, మందుల నిల్వ రిజిస్టర్‌లను పరిశీలించారు. అవసరమైన మందుల నిల్వలు పూర్తిగా అందుబాటులో ఉంచాలాన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది నిర్లక్ష్యంగా ఉండొద్దు

- భూపాలపల్లి ఆర్డీఓ రవి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ రవి

గణపురం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండొద్దని భూపాలపల్లి ఆర్డీఓ రవి సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ శ్రీదేవితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తతతో ఉండాలన్నారు. మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఎవరైనా విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, అనూష ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



నిల్వ నీటిని పారబోయిస్తున్న వైద్య సిబ్బంది

కాళేశ్వరం: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని కాళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుస్మిత అన్నారు. సోమవారం మహదేవపూర్ మండల కేంద్రంలోని టస్సర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 25 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటి ఇంటికి తిరిగి డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్‌గా వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. హెచ్ఎస్ నీరజ, హెల్త్ అసిస్టెంట్ అడప రాజరమణయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాన్ సౌకర్యం కల్పించాలి



ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని సింగరేణి పాఠశాల విద్యార్థులకు వ్యాన్ సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోత్కు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు సింగరేణి అధికారులు వ్యాన్ సౌకర్యం కల్పించకపోవడం దారుణమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులు వ్యాన్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఓటూ జీఎం రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతర బోయిన అజయ్, శేఖర్, పవన్, శ్రీకాంత్, నవీన్, అక్షిత, వైష్ణవి, అనుష, నికిత పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే నాణ్యమైన దిగుబడి

ఏటూరునాగారం : ప్రకృతి వ్యవసాయంతోనే నాణ్యమైన పంటల దిగుబడి వస్తుందని ఏడీఏ అవినాశ్‌వర్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వెలుగు రేఖ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు తనకున్న భూమిలో కొద్దిగా ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ సీఈఓ రజిత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చులు తగ్గించి లాభాలు పొందవచ్చని తెలిపారు. క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించి పంటలు పండిస్తే ముందు తరాల వారికి ఆరోగ్యవంతమైన జీవితం అందించవచ్చన్నారు. ఏఓ వేణుగోపాల్ రైతులు పాల్గొన్నారు.